సాక్షి నిర్మల్

మంగళవారం : 7 : మే : 2024



వ్యర్థాలకు నిప్పుతో ముప్పు

యాసంగి పంటలు ఇప్పుడిప్పుడే చేతికొస్తున్నాయి. తర్వాత పంట వ్యర్థాలకు నిప్పుపెడుతున్నారు. దీంతో మంటలు సమీపంలోని పంటలకు వ్యాపిస్తున్నాయి. IIలో▸



గాడిన పడని ప్రత్యేకపాలన

ప్రత్యేకపాలనలో పంచాయతీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఇన్‌చార్జీ అధికారులు గ్రామాలకు వెళ్లడంలేదు. మరోవైపు పల్లెల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. IIIలో▸

గరిష్టం/కనిష్టం
41.8 /27.7

వాతావరణం

ఎండ తీవ్రత మరింత పెరుగుతుంది. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. సాయంత్రం అక్కడక్కడా వడగండ్లు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోర్టు ఆవరణలో న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: ఖానాపూర్‌కు చెందిన న్యాయవాదిపై ఇద్దరు దుండగులు శుక్రవారం హత్యాప్రయత్నం చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ.. నిర్మల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షురాలు కవితారెడ్డి, లైబ్రరీ సెక్రటరీ అర్చన, న్యాయవాదులు శ్యాంసుందర్‌రెడ్డి, నూనె గంగాధర్, రమణారావు, నరేందర్, మధుకర్, రాజు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదికి పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన సీనియర్ న్యాయవాది వెంకట్‌మహేంద్రపై శుక్రవారం దాడి జరిగింది. బాధిత న్యాయవాదిని మంచిర్యాలబార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించారు. పట్టణంలోని వెంకటమహేంద్ర నివాసానికి వచ్చి దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిపై దాడిని ఖండించారు. దాడులను ప్రభుత్వం అరికట్టాలని కోరారు. పరామర్శించిన వారిలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ సంతోష్‌గౌడ్, ఖానాపూర్ బార్ అసోసియేషన్ చైర్మన్ మంత్రరాజం సురేష్, మంచిర్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు పీసర శ్రీకాంత్, ప్రదీప్‌చంద్ర తదితరులు ఉన్నారు.



వెంకటమహేంద్రను పరామర్శిస్తున్న న్యాయవాదులు

అంతుచిక్కని ఓటరు నాడి!



- గెలుపు.. అంత ఈజీ కాదు..
- బీజేపీ–కాంగ్రెస్ మధ్య టఫ్ ఫైట్
- ఓట్ల చీలికపై బీఆర్‌ఎస్ ఆశలు
- తాజా పరిస్థితులపై.. ప్రధాన పార్టీల ఆరా..
- మూడు పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్!

నిర్మల్: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో గెలుపు ఈసారి ఏ పార్టీకి అంత ఈజీగా లేదు. సిట్టింగ్ స్థానమైనా.. బీజేపీ చెమటోడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. కాంగ్రెస్ ఎంత బలపడ్డా.. గెలుపు దగ్గరలో కనిపించడం లేదు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి డీలాపడ్డ బీఆర్‌ఎస్ ఓట్ల చీలికపైనే ఆశలు పెంచుకుంటోంది. ఓటరు నాడి అంతుచిక్కకపోవడం, క్షేత్రస్థాయి పరిస్థితి అర్థం కాకపోవడంతో మూడు ప్రధాన పార్టీల్లో ఎవరు గెలుస్తారనే దానిపై ఇప్పటికీ క్లారిటీ రావడం లేదు. ప్రస్తుత పరిస్థితులు మాత్రం బీజేపీ–కాంగ్రెస్‌ల మధ్య టఫ్ ఫైట్ నడుస్తున్నట్లు కనిపిస్తోంది. ఆయా పార్టీల అగ్రనేతలైన అమిత్‌షా, రాహుల్‌గాంధీ రావడం ఈ పార్టీల మధ్య పోటీని మరింత పెంచింది. అగ్రనేతల బహిరంగ సభల ప్రభావంపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఆరా తీస్తున్నారు. పోలింగ్‌కు వారమే గడువు ఉండటంతో క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులను అంచనా వేస్తూ వ్యూహాల మార్పుపై సమాలోచనలు చేస్తున్నాయి.

‘కమలం’లో కలవరం..

విలక్షణంగా తీర్పులనిచ్చే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లు ఈసారి ఎటు ఓటేస్తారో.. ఇంకా తేలడం లేదు. గత ఎన్నికల్లో మోదీ ప్రభావంతో ఆదిలాబాద్‌లో బీజేపీ తొలిసారి పాగా వేసింది. కనీసం పార్టీ అభ్యర్థిని కూడా చూడకుండా చాలా గ్రామాల్లో కమలానికి ఓట్లు పడ్డాయి. రెండోసారి గెలుపుకోసం బీజేపీ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని, మాజీ ఎంపీ బీఆర్‌ఎస్‌కు చెందిన గోడం నగేశ్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ ఇచ్చింది. దీన్ని పార్టీలోనే చాలామంది సీనియర్లు వ్యతిరేకించారు. ఈ ప్రభావం ఎన్నికల్లో ఎలా ఉంటుందోనన్న భయం బీజేపీని టెన్షన్ పెడుతోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్ నాలుగు చోట్ల బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. మొదట్లో తమ గెలుపు నల్లేరుమీద నడకే అన్నట్లు కనిపించినా.. క్రమంగా కాంగ్రెస్ పుంజుకోవడం, పార్టీలో అనుకున్న స్థాయిలో సమన్వయం లేకపోవడం, అభ్యర్థిపై వ్యతిరేకత తదితర అంశాలు కమలాన్ని కలవర పెడుతున్నాయి.

ఆశనిరాశల్లో ‘హస్తం’..

గత ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి కాంగ్రెస్ బాగా పుంజుకున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఆ పార్టీకి బాగా కలిసివచ్చింది. ఒకప్పుడు ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో పార్టీ జెండా ఎగరేసిన అనుభవం ఉంది. తమకంటూ ఇప్పటికే ఓటుబ్యాంకు ఉండటం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టడం, రాహుల్‌గాంధీ సభ.. ఇవన్నీ హస్తం పార్టీకి సానుకూలంగా కనిపిస్తున్నాయి. ఉద్యమ నేపథ్యం ఉన్నప్పటికీ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ అంతగా పరిచయం లేని వ్యక్తి కావడం మైనస్‌గా మారింది. ప్రధానంగా నిర్మల్ జిల్లా ఓటర్లకు ఆమె కొత్త కావడంతో ఇక్కడే ఎక్కువగా దృష్టిపెట్టాల్సి వస్తోంది. గత ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీ ఇచ్చిన ఈ జిల్లా నుంచి ఓట్ల శాతం పెంచుకోవాలని పార్టీ కూడా భావిస్తోంది. ఇందులో భాగంగా రాహుల్ సభనూ నిర్మల్‌లో పెట్టినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. కొన్నివర్గాల ఓట్లు పక్కాగా తమకే అన్నట్లు ఉన్నా.. మిగిలిన వర్గాల ఓట్లు తమకు పడతాయా.. లేదా.. అన్న విషయంపై క్లారిటీ రావడం లేదంటున్నారు.

ఓట్ల చీలికపై బీఆర్‌ఎస్ ఆశలు..

అసెంబ్లీ ఎన్నికల వరకూ ఉమ్మడి జిల్లా మొత్తాన్ని బీఆర్‌ఎస్ శాసించింది. 2004, 2014 ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన అనుభవమూ ఆ పార్టీకి ఉంది. కానీ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఆ తర్వాత పరిణామాల నుంచి ‘కారు’ ఇంకా కుదురుకోవడం లేదు. ఎంపీ అభ్యర్థిగా అందరికీ సుపరిచితుడైన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును బరిలో దింపింది. కానీ.. పార్టీ నుంచి భారీ లీడర్లంతా కాంగ్రెస్, బీజేపీల్లోకి వెళ్లిపోవడంతో చాలాచోట్ల బలహీనంగా మారింది. కొన్ని మండలాల్లో బీఆర్‌ఎస్ తరఫున ప్రచారానికి కనీస స్థాయి ఉన్న నాయకులు లేరు. పార్టీ అభ్యర్థి సక్కుతోపాటు మాజీమంత్రి జోగురామన్న తదితరులు తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. చివరకు కాంగ్రెస్, బీజేపీల మధ్య ఓట్లు చీలి, తమకున్న ఓటుబ్యాంకుతో గెలిచే అవకాశాలు ఉన్నట్లు ఆ పార్టీ అంచనా వేస్తోంది.

ఆరా తీస్తున్న పార్టీలు..

ఏ పార్టీకీ గెలుపు అంత సులువుగా లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాయి. తాజాగా ఆదివారం సిర్పూర్‌కాగజ్‌నగర్‌లో కేంద్రమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా, నిర్మల్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బహిరంగసభలు విజయవంతమయ్యాయి. వీటి ప్రభావం పార్లమెంట్ పరిధిలో ఎంతమేరకు పనిచేస్తుందన్న విషయాన్ని ఆదివారం సాయంత్రం నుంచే ఆయా పార్టీల లీడర్లు ఆరా తీస్తున్నారు. వారంరోజుల వ్యవధిలో ఇంకా ఎక్కడెక్కడ ఎలాంటి ప్రచారం చేపట్టాలన్న దానిపై వ్యూహరచన చేస్తున్నారు.

నెత్తిన నిప్పుల కుంపటి



లోకల్‌వెల్మల్ గ్రామంలో ఎండలోనే పనిచేస్తున్న ఉపాధి కూలీలు

- జిల్లాలో నిప్పులు కురిపిస్తున్న భానుడు
- పలుప్రాంతాల్లో 45 డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు
- విలవిలలాడుతున్న చిరువ్యాపారులు, రోజువారీ కూలీలు



నిర్మానుష్యంగా మారిన నిర్మల్ ప్రధాన రహదారి

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. మే చివరి వారంలో నమోదవ్వాల్సిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు మొదటి వారంలోనే నమోదవుతున్నాయి. వారం రోజులుగా 45 డిగ్రీలపైగా ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో చిరుద్యోగులు, రోజు కూలీలు, వీధివ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్లలో ఉన్నవారు కూడా వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలో సోమవారం గరిష్ఠంగా 45.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. నర్సాపూర్(జి), కడెం, దస్తూరాబాద్, తానూరు, లక్ష్మణచాంద, భైంసా, ఖానాపూర్ మండలాల్లో 45 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వివరించారు. ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

సౌకర్యాలు కల్పించండి..

ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పార్లమెంటు ఎన్నికల విధులలో పాల్గొననున్న ఉద్యోగులు, ఉపాధ్యాయ సిబ్బంది అందరికీ సదుపాయాలు కల్పించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా శాఖ తరఫున కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, సరిపడా సిబ్బందిని నియమిస్తూ వారికి సౌకర్యాలు కల్పించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో కూలర్లు, చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని విన్నవించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఖానాపూర్ నియోజకవర్గ సిబ్బంది పోస్టర్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఉట్నూర్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగులకు, గర్భిణులకు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట నరేంద్రబాబు, రమణారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేశ్‌రెడ్డి, గజ్జారం తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ ప్రతినిధులు

ఇంద్రకరణ్‌రెడ్డికి బుద్ధి చెప్పాలి

- ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు
- జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం

నిర్మల్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికలు జరిగి మూడు నెలలు కూడా ఆగకుండా అధికారం కోసం బీఆర్‌ఎస్ పార్టీని వీడి వెళ్లిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించి బుద్ధి చెప్పాలని ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. ఐకేరెడ్డి ఓసారి ఏనుగు, సైకిల్, చైతి, కారు, మళ్లీ చేతి.. అంటూ .. సొంత లాభాల కోసం పార్టీలు మారుస్తున్నారని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో బీఆర్‌ఎస్ నిర్మల్ నియోజకవర్గ బూత్‌లెవెల్ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని మామడ, లక్ష్మణచాంద, దిలావర్‌పూర్, నర్సాపూర్, సారంగాపూర్, నిర్మల్ రూరల్, పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు. జోగు రామన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని, ప్రజలకు అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. ఇంద్రకరణ్‌రెడ్డి దాదాగిరి, దౌర్జన్యాలకు పాల్పడే నాయకుడన్నారు. బీజేపీ సభ్యత్వం లేని తమ పార్టీ నుంచి వచ్చిన గోడెం నాగేష్‌కు ఆ పార్టీ టికెట్ ఇచ్చి, వారి సిద్ధాంతాలను పక్కకు పెట్టారన్నారు. నగేష్ మంత్రిగా, ఎంపీగా జిల్లాకు ఏం చేశాడని ప్రశ్నించాడు. నగేష్‌కు బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను వీడిన వారు వాగులోని తుక్కు, తుంటలు, మొద్దులు అని ఎద్దేవ చేశారు. ఇప్పుడున్న నాయకులు, కార్యకర్తలు పార్టీని నమ్ముకున్న వారని వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. పోలింగ్‌కు కొద్ది రోజుల సమయం ఉందని, కార్యకర్తలు ఓటర్లను కలిసి బీఆర్‌ఎస్ పార్టీ సంక్షేమ పథకాలను వివరించి, ఓట్లను అడగాలని సూచించారు. నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము, నాయకులు డాక్టర్ సుభాష్‌రావు, నజీరుద్దీన్, జగదం రాజు, నెల్ల అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగు రామన్న, వేదికపై ఆత్రం సక్కు

మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: ప్రధాని నరేంద్రమోదీ పాలనలోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జామ్, చించోలి (బి)గ్రామాల్లో సోమవారం ఉపాధిహామీ కూలీలను కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. పదేళ్ల ప్రస్థానంలో నరేంద్రమోదీ ఎలాంటి అవినీతికి తావులేకుండా పాలన సాగించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌గానీ, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌గానీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. ఉపాధిహామీ పథకం నిర్వీర్యంగా అమలు చేస్తూ కూలీలకు బాసటగా నిలిచిన ఏకైక ప్రభుత్వం బీజేపీ అని పేర్కొన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే యువకులు, రైతులు, మహిళలు, కూలీలు, ఇలా అన్నివర్గాల వారికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా పలు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు సత్యనారాయణగౌడ్, విలాస్, చంద్రప్రకాశ్‌గౌడ్, మంతెన గంగారెడ్డి, రాంశంకర్‌రెడ్డి, చెన్న రాజేశ్వర్, శ్రావణ్‌కుమార్, సాహెబ్‌రావు, పోతన్న, తిరుమలాచారి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సుగుణ గెలుపు ఖాయం

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. సారంగాపూర్ మండలం జెండానగర్‌కు చెందిన పలువురు శ్రీహరిరావు సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ముందుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని, ఇప్పుడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కేంద్రంలో అధికారంలోకి రావడానికి సమష్టిగా కృషిచేద్దామన్నారు. ఎన్నికలకు మరో ఏడు రోజుల గడువు ఉందని ప్రతీ కార్యకర్త ఆత్రం సుగుణ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతతత్వ విధానాలు వివరించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య , మాజీ ఏఎంసీ చైర్మన్ రాజీమహమ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, విలాస్‌రావ్, సలీం, భూమన్న పోతన్న గంగాధర్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన సారంగాపూర్ నాయకులు

పారదర్శకంగా ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపా రు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల ర్యాండమైజేషన్‌పై సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి, రెండో ర్యాండమైజేషన్, ఈ వీఎంల కమిషనింగ్ అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. ఎండలు అధికంగా ఉన్నందున ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, తాగునీరు, బెంచీలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

నేడు 5కె రన్..

జిల్లాలో పోలింగ్ శాతం పెంచేలా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు స్వీప్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి ఉదయం 6 గంటలకు 5కె రన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో అన్నివర్గాల ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచారు. గోదాంలోని ఈవీఎంలను పరిశీలించారు. ఈవీఎంల సెగ్రిగేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, నిర్మల్, ముధోల్, ఉట్నూర్ ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్‌రెడ్డి, రవి, సిరికొండ రమేశ్, గంధ్రత్ రమేశ్, మజార్, హైదర్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆటాడుకుందాం రా..



జిల్లా కేంద్రంలో క్రికెట్ శిక్షణలో చిన్నారులు



శిశుమందిర్‌లో వేసవి శిబిరంలో చిన్నారులు



ఇంట్లో చెస్ ఆడుతున్న చిన్నారులు

- సమ్మర్ క్యాంపుల్లో చిన్నారుల సందడి
- క్రీడలు, వైజ్ఞానిక అంశాల్లో శిక్షణ
- జోష్ నింపుతున్న వేసవి ప్రత్యేక శిబిరాలు
- కోచ్‌ల పర్యవేక్షణలో తర్ఫీదు

నిర్మల్‌ఖిల్లా: పాఠశాలలకు వేసవి సెలవులొచ్చాయి. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు ఈ సెలవులను ఎంజాయ్ చేస్తున్నారు. కొందరు ఆటాపాటలతో సరదాగా గడుపుతుంటే, మరికొందరు అదనపు నైపుణ్యాల కోసం జిల్లా కేంద్రంలోని వేసవి శిక్షణ శిబిరాలకు వెళ్తున్నారు. సమ్మర్ క్యాంప్‌లలో క్రీడలు, ఇతర అంశాలపై కోచ్‌లు తర్ఫీదు ఇస్తున్నారు.

నైతిక విలువలపై శిశుమందిర్‌లో శిక్షణ

విద్యార్థులకు నైతిక విలువలు, పురాణ ఇతిహాసాల పఠనం, వేదాల సారం, యోగా తదితర వాటిపై జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతోంది. ఇందులో 16 ఏళ్లలోపు వంద మంది వరకు శిక్షణ పొందుతున్నారు. ఒత్తిడి జయించడం, సూర్య నమస్కారాలు, యోగా ధ్యానముద్ర, నీతికథలు, భగవద్గీత, శ్లోకాలు, దేశభక్తి గీతాలు, అన్నమాచార్య కీర్తనలు వంటివాటిలో శిక్షణ ఇస్తున్నారు. ఆర్ట్‌క్రాఫ్ట్ కృత్యాలు, రామాయణ, మహాభారత, వేదపఠనం వంటి అంశాలపై తర్ఫీదు పొందుతున్నారు.

క్రికెట్ శిక్షణ శిబిరాలు..

జిల్లాకేంద్రంలోని గాయత్రి టౌన్‌షిప్, చించోలి(బి) సమీపంలో, గండి రామన్న సాయిబాబా ఆలయం సమీపంలో క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. పిల్లలు, యువతకు బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ మెలకువలపై శిక్షకులు శిక్షణ ఇస్తున్నారు. ట్రైనర్స్, కోచ్‌లను నియమించి ఆయా అంశాల్లో నైపుణ్యం పెంపొందిస్తున్నారు. పలువురు తల్లిదండ్రులు పిల్లలను ఇండోర్ గేమ్స్ ఆడటానికి ప్రాధాన్యతనిస్తున్నారు.



ఆర్ట్, క్రాఫ్ట్ పనుల్లో శాంకరి, శుభంకరి

ఖాళీ సమయాల్లో చిత్రాలు గీస్తూ..

జిల్లాకేంద్రంలోని వెంకటాద్రిపేట్ కాలనీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు, తెలంగాణ తల్లి రూపశిల్పి బైరోజి వెంకటరమణాచారి కుమార్తెలు శాంకరి, శుభంకరి. ఖాళీ సమయాల్లో టీవీ మొబైల్ ఫోన్లతో కాకుండా సెలవుల్లో చిత్రాలు గీయడం, బొమ్మలు వేయడం, క్రాఫ్ట్ పనుల్లో నిమగ్నమవుతున్నారు. తండ్రి ప్రోత్సాహంతో చిన్నప్పటి నుంచే చిన్నచిన్న బొమ్మలు తయారు చేయడం, పెయింటింగ్ వేయడం నేర్చుకుంటున్నారు.

నేర్పిస్తున్నాం



సరస్వతి శిశుమందిర్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో ఆర్ట్ క్రాఫ్ట్ అంశాలు, రామాయణ, మహాభారత ఇతిహాసాలు, దేశభక్తి గీతాలు, భగవద్గీత శ్లోకాలు, నీతి కథలు నేర్పిస్తున్నాం. దీని ద్వారా పిల్లల్లో ఒత్తిడి దూరం అవుతాయి.

– కొండూరు నరేశ్, నిర్వాహకుడు, నిర్మల్

క్రికెట్‌లో శిక్షణ



పిల్లలు, యువత క్రికెట్‌తో మానసికోల్లాసం కలుగుతుంది. శారీరకంగా దృఢంగా తయారవుతారు. వేసవి సెలవుల్లో మా అకాడమీలో నిత్యం 300 మంది విద్యార్థులు, యువత క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో రాణించేలా మెలకువలు నేర్పుతున్నాం.

– సుదర్శన్, క్రికెట్ ట్రైనర్, లక్కీ క్రికెట్ అకాడమీ, నిర్మల్

మార్షల్‌ఆర్ట్స్‌లో శిక్షణ

ప్రియదర్శిని నగర్‌లో వివేక్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలికల కోసం ఉచితంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇస్తున్నారు. కిన్నెర్ల మృణాళిని శిక్షణ ఇస్తోంది. ప్రతీరోజు 70 మంది బాలికలు ఈ శిక్షణ పొందుతున్నారు.

– బాలికలకు శిక్షణనిస్తున్న మృణాళిని

కల్లం కోసం ఆందోళన

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామస్తులు ధాన్యం కల్లం కోసం సోమవారం ఆందోళన చేపట్టారు. రాంపూర్, మైసంపేట్ పునరావాస కాలనీ ఏర్పాటుతో తాము ఏళ్లుగా ఉపయోగించుకున్న కల్లం స్థలం లేకుండా పోయిందని, దానికి బదులుగా స్థలం చూపాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ రావాలని నినదించారు. తహసీల్దార్ సుజాత అక్కడికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. పల్లె ప్రకృతి వనం పక్కన ఆటవీ స్థలం కల్లం కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. ఇందులో ఎఫ్‌ఆర్వో అనిత, సిబ్బంది కింగ్ ఫిషర్, ఆలీం తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యామ్నాయ స్థలం పరిశీలిస్తున్న తహసీల్దార్

క్లుప్తంగా

వ్యాపారిపై మనీ ల్యాండరింగ్ కేసు?

నేరడిగొండ: ఇటీవల మండల కేంద్రంలో నలుగురు వ్యాపారుల వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీసులు అందులో ఒకరిపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే ఈ కేసు వెనుక మర్మమేమిటో తెలియక ప్రజలు స్థానిక పోలీసులపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బడా వ్యాపారుల వద్ద భారీగా లావాదేవీలు జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో గోప్యత పాటించడం పట్ల 'మామూలుగా' తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకంతో చౌహాన్ జేతాలాల్

కుంటాల: మండల కేంద్రానికి చెందిన ఐదోతరగతి విద్యార్థి చౌహాన్ జేతాలాల్ ఈ నెల 4 నుంచి 6 వరకు గోవాలో నిర్వహించిన జాతీయస్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించాడు. యూత్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతేడాది ఆగస్టు 5 నుంచి 10 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. సదరు విద్యార్థిని విజయసాయి పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ మురళి, పీఈటీ రాథోడ్ అరవింద్ అభినందించారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఎదులాపురం: శాసన సభ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉపకులాల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జాదవ్ శేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేసి చైర్మన్‌గా బైరి వెంకటేశంను నియమించాలన్నారు. దీంతో దళితుల్లో అత్యంత వెనుకబడ్డ 57 ఉపకులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

ఆదిలాబాద్‌టౌన్: అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాలల పర్యవేక్షణ కోసం సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఆర్‌వీఎం రాష్ట్ర ప్లానింగ్ కోఆర్డినేటర్ యు.సంపత్‌రావును పర్యవేక్షణ అధికారిగా నియమించారు. ఈయన వారానికోసారి పాఠశాలలను తనిఖీ చేస్తూ ఆ కమిటీల ద్వారా జరిగే పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది.

వ్యర్థాలకు నిప్పుతో ముప్పు



కాలిన జొన్నపంటను చూపుతున్న రైతులు

- చేతికి అందివచ్చిన పంటలు కాలిపోతున్న వైనం
- దగ్ధమవుతున్న వ్యవసాయ సామగ్రి
- ఆర్థికంగా నష్టపోతున్న రైతన్నలు

తాంసి: యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలు ఇప్పుడిప్పుడే చేతికొస్తున్నాయి. ప్రధానంగా జొన్న, గోధుమ, వేరుశనగ, పెసర, మినుము, నువ్వు పంటలు అధికంగా సాగుచేశారు. కానీ ముందస్తుగా సాగుచేసిన రైతులు భూములను చదును చేసేందుకు పంట వ్యర్థాలకు ఇష్టారీతిన నిప్పుపెడుతున్నారు. దీంతో నిప్పురవ్వలు ఎగిసిపడి పక్కనున్న పంటచేలపై పడడంతో చేతికి అందివచ్చిన పంటలు కాలి బూడిదవుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వరుస ప్రమాదాలు

తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇటీవల పొన్నారి గ్రామానికి చెందిన రైతు గట్టు గంగన్న చేను పక్కనే ఉన్న రైతు తమ పంటచేలలో వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు ఎగిరిపడి ఏడెకరాల్లో జొన్నపంట కాలిపోయింది. సమీపంలోని రైతులు సకాలంలో స్పందించి ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేయడంతో నష్టం తీవ్రత తగ్గింది. తాంసిలో రైతు అశోక్‌కు చెందిన రెండెకరాల్లో జొన్న పంట సైతం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. గిరిగాం శివారులోని పంటచేలలో జరిగిన ప్రమాదంలో స్పింక్లర్ పైపులు కాలిబూడిదయ్యాయి. ఈ విషయంలో రైతులు ఆలోచించి వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా జాగ్రత్తలు పాటిస్తే బాగుంటుంది. వ్యవసాయశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి వ్యర్థాలను కలియదున్నే విధంగా చూడాలి. వ్యర్థాలు కలియదున్నడం వలన కలిగే లాభాలను సైతం రైతన్నలకు తెలియజేస్తే పంట దిగుబడి పెరిగి మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. పంట వ్యర్థాలకు నిప్పు పెట్టే రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం అందించాలి



ఈ యాసంగి సీజన్‌లో నాలుగెకరాల్లో జొన్నపంట వేశా. పక్కనున్న పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో రెండెకరాల్లో జొన్నపంట కాలిపోయింది. దాదాపు రూ.50వేల వరకు నష్టం వాటిల్లింది. అధికారులు పరిశీలించి పరిహారం అందించాలి.

– బెల్లపు అశోక్, రైతు, తాంసి

వ్యర్థాలను తగులబెట్టొద్దు



రైతులు పంట దిగుబడులు వచ్చిన తరువాత తగులబెట్టొద్దు. దీనివల్ల భూసారం తగ్గుతుంది. నాగళ్లతో భూమి లోపలికి వెళ్లేలా కలియదున్నాలి. దీంతో భూసారం పెరిగి పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయి. ఏఈవోల ద్వారా రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, ఏడీఏ, తాంసి

సరిలేరు నీకెవ్వరు..



అంబలి పోస్తున్న జనార్దన్

- అంబలి సేవలో తొమ్మిదేళ్లు
- ఆదర్శంగా నిలుస్తున్న జనార్దన్

ఖానాపూర్: వేసవిలో మండుటెండల్లో ఖానాపూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే వారికి పట్టణానికి చెందిన జనార్దన్ అంబలి పోసి ఆకలి తీరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా (లేఖరిగా) పనిచేస్తున్న పల్లికొండ జనార్దన్ తాను సంపాదించిన దాంట్లోంచి కొంత సామాజిక కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాడు. ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా రాజకీయాలకతీతంగా తొమ్మిదేళ్లుగా సామాజిక సేవచేస్తూ అందరి మన్ననలు పొందుతూ పలువురికి మార్గదర్శిగా నిలుస్తున్నాడు. ఏటా వేసవి ప్రారంభం కాగానే మూడు నెలల పాటు ప్రజలకు అంబలిని అందిస్తున్నారు.

రద్దీ పెరిగినా వెనక్కి తగ్గకుండా...

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు గతంలో అంతగా జనం వచ్చేవారు కాదు. ప్రస్తుతం ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీ సేవలు పెంచడంతో రద్దీ పెరిగింది. అయినప్పటికీ ప్రతీరోజు వెయ్యిమందికి పైగా జనానికి ఉచితంగా అంబలి అందిస్తున్నాడు. దీనికి తోడు రూ.50 వెచ్చించి ఆర్టీసీ బస్టాండ్‌లో కూల్ వాటర్ ఫ్రీజర్ ఏర్పాటు చేసి ప్రజల దాహం తీరుస్తున్నాడు. 7 పదుల వయస్సులోనూ అధైర్యపడకుండా తన సేవలు కొనసాగిస్తున్నాడు.

అంబలితో ఆరోగ్యం...

అంబలి తాగడం ద్వారా వేడిమి నుంచి చల్లదనం పొందడంతో పాటు ఎన్నో పోషక విలువలు అందుతాయి. దీంతో చిన్నా, పెద్ద తేడా లేకుండా అంబలి సేవిస్తున్నారు.

భవిష్యత్‌లోనూ అందిస్తా..



నాటి కాలంలో ప్రతీ వేసవిలో అంబలి తాగడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు వడదెబ్బల నుంచి ఉపశమనం పొందేవారు. తొమ్మిదేళ్ల క్రితం కార్యక్రమం చేపట్టా. భవిష్యత్తులోనూ అందిస్తా.

– పల్లికొండ జనార్దన్, అంబలి దాత

కొన్నేళ్లుగా తాగుతున్నాం



ఆర్టీసీ బస్టాండ్‌లో జనార్దన్ ఉచితంగా అందించే అంబలిని కొన్నేళ్లుగా తాగుతున్నాం. వేసవి వచ్చిందంటే బస్టాండ్‌లో జనార్దన్ అంబలి ఉంటుందని గుర్తుకు వస్తుంది. ఎన్ని పనులున్నా వదిలివెళ్లి అంబలి తాగుతున్నాం.

– కరిపె రాజశేఖర్, ఖానాపూర్

ప్రచారంలో పాల్గొన్న గుజరాత్ ఎమ్మెల్యే



ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

గుడిహత్నూర్: ఏక్ దిన్ మోదీకే నామ్ పేర బీజేపీ నాయకులు సోమవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో గుజరాత్‌లోని దోధ్ ఎమ్మెల్యే గోవర్ధన్ వర్మ పాల్గొన్నారు. మరోసారి మోదీ ప్రధానికావడం ఖాయమని, ఆదిలాబాద్ నుంచి గోడం నగేష్ సైతం భారీ మెజార్టీతో గెలుస్తున్నాడని ఆయన జోస్యం చెప్పారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, పార్టీ మండలాధ్యక్షుడు కేంద్రే శివాజీ, వైస్ ఎంపీపీ భరత్, నాయకులు కేంద్రే లక్ష్మణ్, జాడి సుభాష్, సుధాకర్‌రెడ్డి, వామన్‌గిత్తే, చాటే సంభాజీ, శైలేందర్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

బిడ్డను చూడకుండానే కన్నుమూసిన తల్లి

- ఆస్పత్రిలో బాలింత మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో విరమణ



రవళిక (ఫైల్)

మంచిర్యాలక్రైం: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి కళ్లనిండా చూసుకోకుండానే కాటికి చేరుకున్న ఘటన సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బెల్లంపల్లికి చెందిన బొల్లు వెంకటేశ్ భార్య రవళిక (26) సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నందిని ఆస్పత్రిలో ప్రసవం నిమిత్తం చేరింది. ఆస్పత్రి వైద్యురాలు సాధారణ డెలివరీ చేయడంతో బాబుకు జన్మనిచ్చింది. సదరు మహిళకు అధిక రక్తస్రావం కావడంతో వైద్యురాలు అర్జంటుగా రక్తం కావాలని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంకటేశ్ బ్లడ్ బ్యాంకుకు వెళ్లి రక్తం తీసుకు వచ్చేలోగానే వైద్యురాలు నందిని బాధిత కుటుంబ సభ్యులకు చెప్పకుండానే మహిళను సమీపంలోని మెడిలైఫ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవళిక మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యురాలు నందిని, మెడిలైఫ్ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రవళిక మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ బన్సీలాల్ సిబ్బందితో కలిసి ఆసుపత్రి వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.



ఆందోళన కారులతో మాట్లాడుతున్న సీఐ బన్సీలాల్

దంపతుల ఆత్మహత్యాయత్నం


- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

నిర్మల్‌టౌన్: ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యకు యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ కాలనీకి చెందిన గాందేవార్ కృష్ణమూర్తి, పుష్పలత (56) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. కుమారుడు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కృష్ణమూర్తి ప్రస్తుతం ఇచ్చోడ మండలం పిప్రి గ్రామంలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దీంతోపాటు అదనంగా చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో తీవ్రనష్టం వాటిల్లింది. అంతేకాకుండా కుమారుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. సోమవారం ఉదయం స్థానిక బంగల్‌పేట్ కాలనీలోని వినాయక్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వారిని బయటకు తీశారు. అప్పటికే పుష్పలత మృతి చెందగా కృష్ణమూర్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన కొండ విఠల్ (65) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. మృతుడు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 1న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉరేసుకుని ఒకరు..



సురేష్ మృతదేహం

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన నామ్ముల సురేష్ (30) మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై దిగంబర్ తెలిపారు. సురేష్ కొంత కాలంగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి గ్రామంలోని శ్మశాన వాటికలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మృతుని భార్య నామ్ముల వర్షిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై..

కౌటాల: మండలంలోని గురుడుపేటకు చెందిన బొగరపు భీంరావు(35) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్ మధుకర్ తెలి పారు. మద్యం మత్తులో భార్యతో గొడవపడుతుండడంతో నెలరోజుల క్రితం తన ఇద్ద రు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం సాయంత్రం అతిగా మద్యం తాగి ఇంటిముందున్న సెల్‌టవర్ ఎక్కడంతో స్థానికులు గమనించి వారించడంతో కిందకు దిగాడు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో సెల్‌టవర్ ఎక్కడంతో ప్రమాదవశాత్తు జారిపడడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మధుకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. ఆత్మహత్యకు గల కారణా లు అడిగి తెలుసుకున్నారు. మృతునికి భార్య సౌజన్య, కుమారుడు శాన్విక్, కుమా ర్తె శాన్వి ఉన్నారు. మృతుని తల్లి కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..



జోగేంద్ర మృతదేహం

సోన్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జోగేంద్ర (30) సోన్ మండల కేంద్రంలో పదేళ్లుగా హోటల్ నడిపేవాడు. అంతేకాకుండా చిట్టీలు కూడా నడిపించేవాడు. చిట్టీలలో నష్టం రావడంతో సభ్యులకు డబ్బులు చెల్లించలేక మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో కొక్కానికి నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఖానాపూర్ నుంచి సత్తన్‌పల్లి వైపు వెళ్తున్న ఆటోకు ఎద్దు అడ్డురావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఘటనలో పలువురికి గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులకు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు రెఫర్ చేశారు.

గ్రీన్‌బక్కెట్ పార్శిల్ హోటల్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గ్రీన్ బక్కెట్ బిర్యానీ పార్శిల్ హోటల్‌లో సో మవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో చోరీ జరిగింది. హోటల్ వెనుక భాగం నుంచి ఓ బాలుడు లోనికి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఆ హోటల్ యజమాని నాగేంద ర్ తెలిపాడు. ముగ్గురు వ్యక్తులు బయట ఉ న్నట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయినట్లు తెలి పాడు. మొత్తం రూ.8వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్ దొంగలించినట్లు వివరించాడు. కాగా చోరీకి పాల్పడిన బాలుడు నిర్మల్‌లో పట్టుబడినట్లు తెలిపాడు. ఈ నలుగురే ఇదివరకు రెండుసార్లు తమ హోటల్‌లో చోరీకి పాల్పడినట్లు వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బాగులవాడ వాల్మీకినగర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇ ల్లు దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. కా లనీకి చెందిన బోనగిరి లక్ష్మణ్ ఇంట్లో సోమవా రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పి వేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రితో పాటు నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయి. ఘటనలో సుమారు రూ.1.50 లక్షల ఆస్తినష్టం జరి గిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

బల్దియా ఆటో దగ్ధం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ చెత్తసేకరణ చేసే ఆటో అగ్నికి ఆహుతి అయ్యింది. రో జులాగే సోమవారం కాలనీలో తిరుగుతూ చెత్త సేకరించింది. ఆ తర్వాత ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో గల డంపింగ్ యార్డు కు చెత్తను పడేయడానికి వెళ్లింది. ఈ క్రమంలో ఎండతీవ్రతకు ఆటోలోని ఇంజన్ వేడెక్కి మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి ఫైరింజన్‌కు సమాచారం అందించినా సిబ్బంది వచ్చేసరికి ఆటో పూర్తిగా కాలిపోయింది.

గంజాయి స్వాధీనం

తాంసి: భీంపూర్ మండలంలోని బెల్సరీ రాంపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం గ్రామంలో తనిఖీలు చేపట్టగా గ్రామానికి చెందిన దాంజీ, భీంరావు నివాసాల్లో గంజాయిని గుర్తించారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.1.28 లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు.

ఒకరి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని క్రాంతినగర్‌లో జరిగిన ఘటనకు సంబంధించి పద్మావర్ రాకేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. కాగా సంఘటనకు సంబంధించి 40 మందిపై కేసులు నమోదు చేయగా పలువురిని అరెస్టు చేశారు.

పెళ్లింట విషాదం

- కూతురును అత్తారింటికి సాగనంపి గుండెపోటుతో తండ్రి మృతి

చెన్నూర్: అప్పటి వరకు కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులతో సందడిగా ఉన్న ఆ ఇంట్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. కూతురికి అంగరంగ వైభవంగా వివాహం జరిపించి అత్తారింటికి పంపించిన ఆ తండ్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంఘటన చెన్నూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పబ్బావాడలో నివాసం ఉంటున్న మహ్మద్ ఎజాస్ (60) మెయిన్ రోడ్డులో జనరల్ స్టోర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రా త్రి పెద్దకుమార్తె వివాహ వేడుకలను స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం సంప్రదాయం ప్రకా రం కుమార్తెను అత్తారింటికి సాగనంపి ఇంటికి చేరుకున్నాడు. తెల్లవారుజామున చాతి లో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విషపురుగు కాటుతో బాలుడు మృతి

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దనపల్లి న్యూ కాలనీ పక్కనే ఉన్న మామిడితోటలో సోమవారం విషపురుగు కాటుతో రాంకరణ్ దుర్గేష్ (5) మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాంకరణ్ రాంప్రసాద్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి పెద్దనపల్లి శివారులో న్యూకాలనీ వద్ద ఉన్న మామిడి తోటలో కాయలు తెంపేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి దుర్గేష్ కుడిచేతి మట్టపై వాపు కనిపించింది. వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ఓటుహక్కు వినియోగించుకున్న పోలీసులు



సిరాచుక్కను చూపుతున్న పోలీసులు

కుంటాల: లోకసభ ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఓటు వేసే అవకాశం కల్పించింది. సోమవారం భైంసా ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో కుంటాల పోలీసుల సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఎండలో జాగ్రత్తలు తీసుకోవాలి

లక్ష్మణచాంద: మండల ప్రజలు ఎండలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాంప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎండతీవ్రత కారణంగా ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తరచూ తీసుకోవాలన్నారు. ఎంపీవో నసీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌రాజ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రధాని కావాలని పూజలు



పూజలు చేస్తున్న మోహన్‌రావు

కుంటాల: దేశ ప్రధానిగా మోదీ కావాలని కోరుతూ మండలంలోని సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వరాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్‌రావు పూజలు నిర్వహించారు. అదే విధంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలువాలని మొక్కుకున్నారు. కౌన్సిలర్లు గాలి రవి, దిలీప్, మాజీ ఎంపీపీ సుభాష్ యాదవ్, లక్ష్మణ్ పటేల్, రామకృష్ణ, సాధు ప్రభాకర్, రాజన్న, కమలాకర్, సోమ సత్తయ్య, కమలేష్, సురేష్ పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు గంగారాం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం గంగారాంను పరామర్శించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, నాయకులు కేశం రమేశ్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

మోటారుకు మరమ్మతు



మరమ్మతు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీలోని బొడ్డెనికుంట వద్ద కాలిపోయిన మోటారుకు సోమవారం మరమ్మతు చేశారు. స్థానిక కాలనీవాసుల విన్నపం మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్ ఆధ్వర్యంలో సిబ్బందితో దగ్గరుండి మరమ్మతు చేయించారు. సిబ్బంది జావీద్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

సీఐటీయూకి రాజీనామా

ఖానాపూర్: సీఐటీయూ యూనియన్‌కు పలువురు అంగన్‌వాడీ టీచర్లు సోమవారం రాజీనామా చేశారు. టీచర్లు సుమిత, హిద్మ, సుగుణదేవి, సౌందర్య, రత్నమాల, సంధ్య, కరుణ, రాణి, గంగ, కృష్ణవేణి, రాజేశ్వరి, తదితరులు ఉన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు సోమవారం జిల్లా కలెక్టర్ రాజార్షి షా చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ స్వర్ణలతను, విద్యార్థులను అభినందించారు.

గాడిన పడని ప్రత్యేకపాలన

- గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు
- రోడ్లపై చెత్తాచెదారం
- అధ్వానంగా డ్రెయినేజీలు
- పట్టించుకోని అధికారులు



వాలేగాంలో ప్రధాన రోడ్లపై చెత్తాచెదారం

భైంసారూరల్: ప్రత్యేకపాలనలో పంచాయతీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఇన్‌చార్జీ అధికారులు గ్రామాలకు వెళ్లడంలేదు. మరోవైపు పల్లెల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. రోజురోజుకు సమస్యలు తీవ్రతరం అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. డ్రెయినేజీలు అధ్వానంగా తయారయ్యాయి. భారీ వర్షాలకు డ్రెయినేజీలు మూసుకుపోతున్నాయి. చెత్తాచెదారం తొలగించడం లేదు. ఎక్కడికక్కడ రోడ్లపై మురుగునీరు చేరుతోంది.

సమస్యల తిష్ట..

సర్పంచుల పదవీకాలం ముగియగానే ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వారి పాలనలో సమస్యలు తిష్టవేశాయి. చిన్న పంచాయతీల్లో సిబ్బందికి జీతాలు రాకపోవడంతో పనులు చేసేందుకు ఆసక్తి చూపడంలేదు. ఫలితంగా రోడ్లపైనే చెత్తాచెదారం దర్శనమిస్తుంది. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు కాలిపోతున్నాయి. తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రత్యేకపాలనలో బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనులు చేసేందుకు అంతా ఇబ్బందిపడుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లలో సమస్యలు వస్తున్నాయి. ఎన్నికల విధులు, ఇతర పనులతో ప్రత్యేక అధికారులు గ్రామాల్లోకి వెళ్లడం లేదు.



బోరిగాంలో రోడ్లపై మురుగునీరు



కుంసరలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మూలనపడ్డ ట్యాంకర్లు

ఏటా వేసవిలో హరితహారంలో నాటిన మొక్కలను కాపాడేందుకు పంచాయతీకి ఇచ్చిన ట్రాక్టర్లకు ట్యాంకర్లు బిగించి నీటిని పట్టించేవారు. ఈ వేసవిలో ట్యాంకర్లలో నీటిని తీసుకువెళ్లేవారే లేరు. ట్యాంకర్లన్నీ మూలనపడ్డాయి. ఉదయం వేళ చెత్త సేకరించి మధ్యాహ్నం, సాయంత్రం హరితహారం చెట్లకు పంచాయతీ ట్యాంకర్లతో నీటిని పట్టేవారు. ప్రధాన వీధుల్లో దుమ్మురాకుండా నీటిని అందించేవారు. మండలంలో ఏ పంచాయతీలో ట్యాంకర్లతో నీటిని పట్టించే పరిస్థితి లేదు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో పల్లెల్లో నామమాత్రపు పనులే జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండువేసవిలో మొక్కలకు నీటిని అందించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ప్రత్యేకపాలనలో వాలేగాం పంచాయతీకి వెళ్లి చూడగా చెత్తాచెదారాన్ని రోడ్లపై తగులబెడుతున్నారు. పంచాయతీ ట్రాక్టర్‌లో సెగ్రిగేషన్ షెడ్డుకు వెళ్లాల్సిన చెత్త రోడ్లపై వేస్తున్నారు. జీపీలో నిర్మించిన షెడ్డు గతేడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. డంపింగ్‌యార్డు లేక సిబ్బంది గ్రామంలో రోజువారీగా సేకరించే చెత్తను తీసుకువచ్చి అక్కడే కాల్చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, తడి,పొడి చెత్తను ఒకేచోట తగులబెడుతున్నారు. కొట్టుకుపోయిన షెడ్డు స్థానంలో కొత్తది నిర్మించలేదు. కొత్తగా ఏర్పాటైన చిన్న పంచాయతీలకు నెలనెలా వేతనాలకు సంబంధించి బిల్లులు రావడం లేదనే ఆరోపణలున్నాయి. చిన్న పంచాయతీల్లో పనిచేసే సిబ్బంది వేతనాలు రాక ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని జీపీల్లో పనులు చేసేందుకు ముందుకు రావడంలేదు.

సమస్యలు లేకుండా చూస్తాం

పంచాయతీల్లో సమస్యలు లేకుండా చూస్తాం. ఏ సమస్య ఉన్న మా దృష్టికి వస్తే పరిష్కారానికి కృషిచేస్తాం. ప్రత్యేక అధికారులు పంచాయతీలకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారు. కార్యదర్శులతో కలిసి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎప్పటికప్పుడు పనులు చేయిస్తున్నారు.

– సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో

నగేశ్‌ను గెలిపించండి



కుభీర్: నిగ్వాలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్



తానూరు: దాగాంలో ప్రచారం చేస్తున్న నాయకులు

కుభీర్: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ కోరారు. మండలంలోని నిగ్వా, న్యూసాంవ్లి, సిర్పెల్లితండా, ఫకీర్ నాయక్ తండా, దొడర్నా గ్రామాల్లో సోమవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కమలంపై ఓటు వేసి నగేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నాయకులు గులాబ్, రమేశ్, బి.విఠల్, డాక్టర్ పోశెట్టి, కనకయ్య, దత్తాత్రి, ఆనందర్‌రావ్, సాయినాథ్ ఉన్నారు.

భైంసాటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నారాయణ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 152,153 బూత్ పరిధిలోని సిద్ధార్థనగర్, నేతాజీనగర్‌లో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మోదీని మూడోసారి ప్రధాని చేయాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. నాయకులు వేణు, పట్టణ అధ్యక్షులు మల్లేశ్వర్, గౌతమ్ పింగ్లే, రావుల పోశెట్టి, సాహెబ్‌రావు, అల్లెం దిలీప్, బాలాజీ సూత్రావే, తదితరులు ఉన్నారు.

తానూరు: మండలంలోని దాగాం గ్రామంలో సోమవారం బీజేపీ నాయకులు ప్రచారం చేపట్టారు. పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ గెలిపించాలని ఉపాధి కూలీలను కోరారు. వారు పనిచేసే చోటకు వెళ్లి పువ్వుగుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మండల అధ్యక్షుడు వై.చిన్నారెడ్డి, నాయకులు బాజీరావ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల నాయకుడు అడ్వాల రమేశ్ పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా మండలంలోని పార్‌పెల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, వైకుంఠధామాలు, పల్లెవనాలు కేంద్రం ఇచ్చిన నిధులతోనే చేపట్టినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే ఎంపీ అభ్యర్థి నగేశ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు జనార్దన్, అనిల్, శ్రీధర్‌రెడ్డి, ఓస రాజు, చందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుంటాల: అంబకంటిలో ప్రచారం నిర్వహిస్తున్న మహిళా మోర్చా సభ్యులు

కుంటాల: దేశంలో బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యమవుతుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని అంబకంటి, వెంకూర్, ఓలా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నగేష్ ను గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ గుడ్డేటి నర్సయ్య, బీజేపీ మహిళా మోర్చా మండల కన్వీనర్ పంగెర స్వప్న, నాయకులు సాయి సూర్యవంశీ, గజానంద్, బాజీరావు పటేల్, గోవిందరావు పటేల్, సాయిసిందే, అనిల్, సాయి ఉన్నారు.

లోకేశ్వరం: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ముథోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ కోరారు. సాథ్‌గాం గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మోదీ క్యాలెండర్, కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు నల్ల రమేశ్, గోపి, సరస్వతి, సాయినాథ్ పటేల్ ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. నడించెరువులో ఉపాధి కూలీలకు కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నరేందర్, రాజేందర్, దత్తురాం, గంగారాం, మహేశ్ పాల్గొన్నారు.

వేణుగోపాలచారి వాహనం తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల కోడ్‌లో భాగంగా కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు వేణుగోపాలచారి వాహనాన్ని సోమవారం అధికారులు తనిఖీ చేశారు. మండలంలోని సత్తన్‌పల్లి ప్రధాన రహదారి నుంచి వెళ్తున్న వాహనాన్ని ఆపి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఇన్‌చార్జి రవీందర్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ



బుట్టాపూర్‌లో వాహనం తనిఖీ చేస్తున్న సభ్యులు

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్, గోడిసిర్యాల ఎక్స్‌రోడ్డు, మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. అధికారులు రవీందర్, రాంచందర్, జోగు రాజేశ్వర్, ముకీద్ తదితరులు ఉన్నారు.

నేడు దుర్గాప్రసాద్ స్వామిజీ రాక

లోకేశ్వరం: మండలంలోని గడ్చాంద, ధర్మోర గ్రామానికి మంగళవారం ఉదయం 10 గంటలకు అఖిల భారత హనుమదీక్షా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామిజీ వస్తున్నట్లు ధర్మోర హనుమాన్ మందిర నిర్మాణ పూజారి హన్మంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు హాజరుకావాలని కోరారు.

హనుమాన్ మందిర ద్వితీయ వార్షికోత్సవం

కుభీర్: మండల కేంద్రంలో హనుమాన్ మందిరం ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రమోద్ మహారాజ్ ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కాలనీవాసులతోపాటు గ్రామపెద్దలు నాగేశ్వర్, సంతోష్, బాలాజీ, పుప్పాల పిరాజి, నారాయణ్, ఆనంద్, నిఖిల్ తదితరులు ఉన్నారు.

గుడిసెలు తొలగించాలి

బేల: మండల కేంద్రం పరిధిలోని బురాన్‌పూర్ శివారులో సర్వే నం. 29/ఏలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన గుడిసెలను తొలగించాలని సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి గట్లెవార్ గజానన్‌కు ఆదివాసీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా రాయిసెంటర్ మండల అధ్యక్షుడు కొరంగే సోనేరావు మాట్లాడుతూ.. సర్వే నం.29/ఏ భూ వివాదంపై హైకోర్టులో కేసు కొనసాగుతుందన్నారు. మళ్లీ ఇటీవల పలువురు గిరిజనేతరులు ఆ భూమిలో గుడిసెలు వేస్తున్నారని, దీన్ని వెంటనే నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొడప రవి, ఆడ సంతోష్, కొడప జలపత్‌రావు, భీంరావు, మెస్రం జంగు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడి మృతి

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేతావత్ బిక్కు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్‌నాయక్ నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడిగా, గ్రామ పంచాయతీ కారోబారిగా ఎన్నో సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియలో జెడ్పీ చైర్మన్ పాడే మోశారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఏలేటి గంగారెడ్డి, పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డితోపాటు పలువురు సోమవారం బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా, వారికి కాషాయ కండువా కప్పారు. గంగన్న, అడ్వాల రమేశ్, ముత్యం రెడ్డి, సురేశ్, ప్రశాంత్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, మల్లేశ్, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

సారంగాపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామ తాజా మాజీ సర్పంచ్ దశరథ భోజరాజు సోమవారం బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఆయనతోపాటు గ్రామానికి చెందిన పలువురు యువకులు కాషాయ కండువా కప్పుకున్నారు.

‘రాజ్యాంగాన్ని గౌరవించేవారికే మా మద్దతు’



మాట్లాడుతున్న ప్రభాకర్ గడపాలే

భైంసాటౌన్: భారత రాజ్యాంగాన్ని గౌరవించే కాంగ్రెస్ పార్టీకే లోక్‌సభ ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే అన్నారు. ఈమేరకు సోమవారం బీఎస్ఐ నాయకులు, సభ్యులతో కలిసి పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు ధర్మం, మతం పేరిట విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇలాంటి మనువాద పార్టీని ఓడించాల్సిన అవసరముందన్నారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే అన్నివిధాల దేశం అభివృద్ధి చెందిందన్నారు. సమావేశంలో బీఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అభారావు వాగ్మారె, జిల్లా అధ్యక్షుడు రమేశ్ వాగ్మారె, మాజీ అధ్యక్షులు ఆనంద్‌రావు బోతె, శంకర్ చంద్రే, కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం బూత్‌ల వారీగా ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. మండలంలోని మస్కాపూర్‌లో గల 246 బూత్‌లో నాయకులు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. సుర్జాపూర్‌లో మీటింగ్‌లను బీజేపీ మండలాధ్యక్షుడు టేకు ప్రకాశ్, నాయకుడు తోకల బుచ్చన్న తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు డి.మల్లయ్య, పన్నెల సురేష్, పిట్టల భూమన్న, తిరుమల గిరి, ఇనుముల స్వామి, బాశెట్టి సుధాకర్, పంజాల శివ, కొండవేని రమేశ్, సత్యవతి పాల్గొన్నారు.



విద్యానగర్ కార్నర్ మీటింగ్‌లో నాయకులు

కాంగ్రెస్ గెలుపు ఖాయం



భైంసాటౌన్: కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపటేల్



మామడ: న్యూసాంగ్వీలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

భైంసాటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ అన్నారు. పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలోని ఆయన నివాసంలో సోమవారం పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీలో చేరినవారిలో హవర్గా మాజీ సర్పంచ్ భుజంగ్‌రావు, లోకేశ్వరం మాజీ సర్పంచ్ కపిల్, భీంరావు(హత్‌గాం), కిష్టాపూర్ మాజీ సర్పంచ్ శైలజ నరేందర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, ప్రవీణ్, రాజు, ముత్తన్న, భోజన్న, రాములు, నర్సయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం

సోన్: పార్లమెంట్ ఎన్నికల అనంతరం గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. మండల కేంద్రంతోపాటు న్యూవెల్మల్, బొప్పారం, సంగంపేట, కూచన్‌పెల్లి గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం న్యూవెల్మల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొడ్డు లస్మన్న, గడ్డం స్వామి ఆధ్వర్యంలో రైతులు, యువకులు కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వారికి కండువాలు కప్పారు. అంతకుముందు సంగంపేటలో పార్టీ మహిళ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, ఉపాధి కూలీల వద్ద ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, మోహినొద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, ఎంబడి గంగాధర్, నర్సయ్య, గంగారెడ్డి, గంగాధర్, దశరథ్, చిన్నయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: ఆత్రం సుగుణను గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు కోరారు. మండలంలోని మామడ, న్యూసాంగ్వి, పొన్కల్, దిమ్మదుర్తి, నల్దుర్తి గ్రామాల్లో సోమవారం ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. సంతోష్, జైసింగ్, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, రఫి, రమణారెడ్డి, పడాల శ్రీనివాస్, బాపయ్య, లింగన్న, రత్నయ్య, నర్సారెడ్డి ఉన్నారు.

నర్సాపూర్(జి): ఆత్రం సుగుణ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీపీసీసీ సెక్రెటరీ అనిల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రచారంలో కాంగ్రెస్ చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, నాయకులు అజీమ్, కొంద్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఖానాపూర్: ఆత్రం సుగుణను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని పలు కాలనీల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. షౌకత్‌పాషా, బొప్పారపు శ్రీనివాస్, రవి, అమేర్, చిన్ను, తదితరులు ఉన్నారు.

కడెం: నర్సాపూర్‌లో సోమవారం కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మల్లేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, భూషణ్, రాజు, బాదురావు, గంగన్న, తదితరులున్నారు.

‘ఆత్రం సక్కుకు ఓటేయాలి’

తానూరు: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ నాయకురాలు రమాదేవి కోరారు. మండలంలోని కోలూరు గ్రామంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెరువు వద్ద పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, గజానంద్, లక్ష్మణ్, మొగ్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, విఠల్, సంజీవ్ రెడ్డి, గోపాల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకుడు లోలం శ్యాం సుందర్ కోరారు. మండలంలోని ముద్గల్, మచ్కల్ గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. కూలీల వద్దకు వెళ్లి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. నాయకులు గంగాధర్, విఠల్, కార్యకర్తలు ఉన్నారు.



కోలూరులో ప్రచారం చేస్తున్న రమాదేవి

బీఆర్ఎస్‌లో చేరికలు

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన యువకులు వెంకాయి సాయిరెడ్డి, మల్కారెడ్డి, రైతుబిడ్డ సోన్న సతీశ్, భూమేష్ తదితరులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. నిర్మల్‌లో జరిగిన ఎన్నికల సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రామ్‌కిషాన్ రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులు